29న నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023-24 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కోసం ఎంపిక పరీక్ష ఈనెల 29 జరుగుతుందని కిల్తంపాలెం నవోదయ పాఠశాల ప్రిన్సిపాలల్ వి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం జిల్లాలోని 27 మండల కేంద్రాల్లోనూ, మన్యం జిల్లాలోని 9 కేంద్రాల్లోను పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 10.30గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు హాల్ టిక్కెట్‌తో పాటు బాల్ పాయింట్ పెన్ను తెచ్చుకోవాలన్నారు. ఈమేరకు కోటలో పరీక్షా కేంద్రాల సూపరింటెండెంటతో డిఇఒ లింగేశ్వరరెడ్డి సమావేశమైనట్లు తెలిపారు.

విజయనగరం సభలో అభివాదం చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు, ఎస్.కోట సభలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు మర్రాపు సూర్యనారాయణ

బిజెపికి మద్దతిచ్చే పార్టీలన్నీ ప్రజా ద్రోహులే

మోడీ గద్దె దిగితేనే దేశ ప్రజలకు రక్షణ • బహిరంగసభలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలోని బిజెపికి మద్దతునిచ్చే పార్టీలన్నీ ప్రజా ద్రోహులని, మోడీని ఓడించడం ద్వారానే దేశ ప్రజలకు రక్షణ ఉంటుందని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జి.ఈశ్వరయ్య అన్నారు. వామపక్షాలు చేపట్టిన ప్రచారభేరిలో భాగంగా గురువారం స్థానిక కోట వద్ద జరిగిన బహిరంగ సభలో ముందుగా వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రపంచ పటంలో ఎక్కడో ఉన్నామని చెప్పడం ప్రజలని మోసం చేయడమేనని అన్నారు. ప్రభుత్వ లెక్కలు ప్రకారం ప్రతి ఏటా 60వేల మంది ఉద్యోగాలు కోల్పోతుంటే రాబోయే రోజుల్లో యువత పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు రైతులకు గిట్టుబాటు ధర లేదని, కార్మిక చట్టాలను మార్పు చేసి పెట్టుబడిదార్లకు తొత్తుగా మార్చేశారని అన్నారు. మోడీ పాలనలో దోపిడీ దార్లు.ఆస్తులు సంపాదించుకొని కోటీశ్వరులు, శత కోటేశ్వరుల్లా ఎదుగుతుంటే దేశ ప్రజలు మాత్రం ఇంకా పేద వారిగానే మారుతున్నారని అన్నారు. రాష్ట్రంలో బిజెపికి అనుకూలంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో ఏ చట్టం తెచ్చినా జగన్, చంద్రబాబు మద్దతు ఇస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ గురించి అడిగే పరిస్థితి లేదన్నారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ ఆర్థిక నేరస్తులను అరెస్ట్ చేయకుండా వారికి ఎంపి పదవులు ఇస్తున్న ఘనత మోడీదేనని అన్నారు. ప్రభుత్వ పరిశ్రమలకు అమ్మేసి దోపిడీ దారులకు దేశ సంపదను కొల్లగొడుతున్నారు అన్నారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ మాట్లాడుతూ దేశ సంపద ప్రజలకు అందాలని పోరాడి జైలుకు వెళ్లిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. జిల్లా నుంచి లక్షల మంది వలసలు పోతే జిల్లా మంత్రులు, నాయకులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, బుగత అశోక్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని రాజవీధి వద్ద సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ప్రచార భేరిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తమ్మినేని స్యూనారాయణ మాట్లాడారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దించేందుకు ప్రజలంతా కంకణం కట్టుకోవాలని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్నాయి అన్నారు. పెరుగుతున్న ధరలు కారణంగా దేశంలో 80 శాతం మంది ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశాలు, గ్రీన్ అంబాసిడర్లు, టోల్ గేట్ సిబ్బంది, హేచరీ సిబ్బంది, విఆర్‌ఎలు, కార్మికులు పాల్గొన్నారు

బిజెపిని ఓడిస్తేనే దేశానికి భవిష్యత్తు

శృంగవరపుకోట : 2024లో జరిగే ఎన్నికల్లో బిజెపిని ఓడిస్తేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని సిపిఎం, సిపిఐ రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యనారాయణ, పి.కామేశ్వరరావు అన్నారు. గురువారం సుబ్బరామిరెడ్డి కళ్యాణమండపంలో జరిగిన ప్రచార బేరి ముగింపు సభలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీని భుజాలపై మోస్తున్నాయని, ఆ పల్లకీని దించి రాష్ట్ర భవిష్యత్ కోసం రాజకీయ పోరాటంలో కలసి రావాలని వారు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, మతసామరస్యం, సామాజిక న్యాయం, సమాఖ్య స్ఫూర్తి వీటన్నిటిని పక్కన పెట్టి రాష్ట్రాల హక్కులపై దాడులు చేస్తూ ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తోందని వారు దుయ్యబట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, గాడి అప్పారావు, సిపిఐ నాయకులు మద్దికృష్ణ, డేగల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి ఇలాకాలో
అట్టడుగు స్థానం

ప్రభుత్వ కళాశాలల్లో తగ్గిన ఇంటర్ ఫలితాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ఇలాకాలో ఇంటర్ ఫలితాల్లో జిల్లా అట్టడగు స్థానంలో ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఫలితాల శాతంలో కొద్దిపాటి మెరుగుదల తప్ప రాష్ట్రం మొత్తంగా చూసు కుంటే అత్యల్ప ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది 10 ఏపి సాంఘిక సంక్షేమ గురుకులాల నుంచి 626 మంది పరీక్షకు హాజరు కాగా 250 మంది ఉత్తీర్ణులై 39.90 శాతం ఫలితాలు నమోదు చేశారు. గత ఏడాది ఇవే విద్యా సంస్థలు 61.35 శాతం ఫలితాలు సాధించాయి. 6 గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల నుంచి 696 మందికి 451 ఉత్తీర్ణులై 64.80 శాతం నమోదు చేయగా గత ఏడాది 79.94 శాతం సాధించారు. 83 ప్రైవేటు విద్యా సంస్థల నుంచి 12150 మంది విద్యార్థులు హాజరు కాగా 6924 మంది ఉత్తీర్ణులై 56.99 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 52.88 శాతం ఫలితాలు వచ్చాయి. ఏడాది ప్రైవేటు విద్యా సంస్థలలో ఫలితాలు 4శాతం పెరిగాయి. జిల్లాలోని 23 కెజిబివిల నుంచి 717 మంది పరీక్ష రాయగా వారిలో 344 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది 47.98 ఫలితాలు రాగా, గత ఏడాది 55.43 శాతం ఫలితాలు వచ్చాయి. 16 మోడల్ స్కూల్స్ నుంచి 1179 మందికి 705 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది కంటే 6.50 శాతం వెనుకపడ్డాయి. 24 ప్రభుత్వ జూనియర్ కళాశాల ల నుంచి 3162 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 950 మంది ఉత్తీర్ణులై 30.01 శాతం ఫలితాలు నమోదు చేశారు. గత ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 31.78 శాతం ఫలితాలు నమోదు కావడం జరిగింది. గతంలో 100 శాతం ఫలితాలు సాధించిన కెజిబివిలు, మోడల్ స్కూళ్లు ఈ ఏడాది లేకపోవడం గమనార్హం.

100 శాతం సిలబస్ ప్రభావం

తొలుత 75 శాతం సిలబస్ ఆధారంగానే పరీక్షలు ఉంటాయని, చివరిలో 100 శాతం సిలబస్ ఆధారంగానే పరీక్షలు ఉంటాయని పేర్కొనడం వల్ల ఫలితాలపై ప్రభావం కనిపించింది. ప్రశ్నా పత్రాలు కూడా కఠినంగా ఇవ్వడం వలన ఫలితాలపై ప్రభావం చూపించింది. గత ఏడాది కంటే ఫలితాలు శాతంలో పెరిగింది

- ఎం.సత్యనారాయణ, ఆర్ఐఒ

సహనానికి ప్రతిరూపం మహర్షి భగీరథుడు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మహర్షి భగీరథుడు పరోపకారానికి.. సహనానికి ప్రతిరూపమని, ఆయన చేసిన అకుంఠిత దీక్షలు కచ్చితంగా నేటితరం యువతలో స్ఫూర్తిని నింపుతాయని కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ పేర్కొన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని వెనుకబడిన సంక్షేమ తరగతుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్లో గురువారం వేడుకలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం. గణపతిరావు, బిసి సంక్షేమ శాఖ అధికారి యశోధనరావు భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథుడు ఎంత కష్టాన్నైనా లెక్క చేయకుండా అనుకున్నది సాధించే తత్వం కలిగిన మనిషి అని, అందుకే ఆయన మహర్షి అయ్యారని అన్నారు. ఆయన బాటలో మనం కూడా నడిచి పెట్టుకున్న లక్ష్యాలను అకుంఠిత దీక్షతో సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజిరావు, డిఎస్ఒ సుదర్శనరావు, కలెక్టరేట్ ఎఒ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు

బిజెపి ఎమ్‌పిపై చర్యలు తీసుకోవాల్సిందే

ఐద్వా, ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెజ్లింగ్ క్రీడాకారులను లైంగికంగా వేధించిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలు ప్రజాసంఘాల ఆధ్వర్యాన అంబేద్కర్ జంక్షన్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన రెజ్లింగ్ మహిళా క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులకు పాల్పడటం దేశానికి సిగ్గు చేటున్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని అన్నారు. ప్రపంచ స్థాయి క్రీడాకారులను వేదింపులకు గురి చేస్తే సామాన్య మహిళకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు. వెంటనే ఎంపి పదవి నుంచి తప్పించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలో సిఐటియు నాయకులు యు ఎస్ రవికుమార్, వి.లక్ష్మి, బి.రమణ, కె.త్రినాథ్, భగవాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస రావు, ఐద్వా నాయకులు వి.లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్. వెంకటేష్, నాయకులు డి.రాము, సిహెచ్. పావని, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ హరీష్, రుద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా సిఎం సభ ఏర్పాట్లు

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-భోగాపురం

సిఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మే 3న భోగాపురం పర్యటన సందర్భంగా అధికారులంతా తమకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించి కార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎక్కడా కొరత రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధికారులతో కలసి కలెక్టర్ గురువారం భోగాపురం మండలంలో సిఎం కార్యక్రమం జరిగే ఎ.రావివలస ప్రాంతంలో పర్యటించి సభావేదిక, జిఎంఆర్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్, హెలిపాడ్, శంకుస్థాపన శిలాఫలకాల వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. బహిరంగ సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. జాతీయ రహదారికి ఇరువైపులా రెండు చోట్ల పార్కింగ్ ప్రదేశాలను జెసి మయూర్ అశోక్ తో కలసి పరిశీలించారు. ఆ ప్రదేశాలకు బస్సులు, ఇతర వాహనాలు చేరేలా అప్రోచ్ రోడ్లను రోడ్లు భవనాల శాఖ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. సభా వేదికకు సమీపంలో 104 వాహనాలు, 108 అంబులెన్స్ వాహనాలు సిద్ధంగా వుంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, చీపురుపల్లి ఆర్‌డిఒ అప్పారావు, ఎస్‌డిసిలు సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, పద్మలత, బి.సుదర్శన దొర, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

కేసు కొట్టివేయడంతో కోర్టు వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

వామపక్ష నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం

భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు మద్దతుగా వామపక్ష పార్టీల ఆధ్వర్యాన విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద 2017 సెప్టెంబర్‌లో నిరసన తెలిపిన నాయకులపై పోలీసులు పెట్టిన కేసును జిల్లాకోర్టు గురువారం కొట్టివేసింది. 25 మందిపై కేసులు నమోదు చేయగా విచారణ అనంతరం ఎడిఎం జిల్లా కోర్టు జడ్జి కొట్టివేశారు. దీంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై వామపక్షాలు నిరంతరం పోరాడుతాయని తెలిపారు.

రేషన్ సరుకులు పంపిణీ సక్రమంగా అందించాలి

మెరక ముడిదాం : మండలంలో రేషన్ సరుకులు పంపిణీ ప్రజలకు సక్రమంగా అందే విధంగా రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు చాడాలని ఇంచార్జ్ తహశీల్దార్ పిన్నింటి రామారావు తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. మాట్లాడుతూ ప్రతి నెల రేషన్ డీలర్లు చీపురుపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లి దగ్గరుండి సరుకులు విడిపించుకోవాలన్నారు. లబ్ధి దారులకు ఏవిధమైన ఆటంకం కలుగ కుండా చూడాలన్నారు. దానికి రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో రేషన్ డీలర్ల యూనియన్ ప్రెసిడెంట్ సుంకరి జయ సింహ నాయుడు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులు ఆందోళన

భోగాపురం: అకాల వర్షంతో మొక్కజొన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికి అంది వచ్చిన పంట నోటి వరకు వచ్చే సమయంలో అకాల వర్షాలు కురుస్తున్నాయని దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. నాలుగు రోజులుగా మొక్కజొన్న పంట జొన్న కంకులు విరిచి పొలాల్లోనే ఉన్నాయని, అకాల వర్షాలతో భద్రపరచడం కష్టతరంగా మారుతుందని మండలంలోని చాకివలస గ్రామానికి చెందిన రైతు లంక అప్పలనాయుడు అన్నారు.

సిఎం సభను జయప్రదం చేయండి

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

తాడ్డి ఉషకు కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

మే 3న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, చింతపల్లి వద్ద ఫ్లోటింగ్ జెట్టీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సవరవల్లి గ్రామం వద్ద ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలను, వైసిపి నాయకులను, కార్యకర్తలను కోరారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్ సర్వేకు ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తుందని అన్నారు. విజయనగరం జిల్లాలో 6లక్షల 50 వేలు కుటుంబాలకు గాను సుమారు 4లక్షల 50 వేలు కుటుంబాలకు సర్వే పూర్తిచేసుకుందని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గతంలో అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి నేడు మళ్లీ ప్రజలను మభ్య పెట్టేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారని. కానీ ప్రజలు వారిని నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. ఇటీవలే మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు గారు చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ.. తప్పకుండా మూడు సంవత్సరాల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తిచేసి ఆయన కల భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో ప్రయాణించే విధంగా ముఖ్యమంత్రి సహకరిస్తారని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నలుగురికి కారుణ్య నియామకాలు

జిల్లాపరిషత్ పరిధిలోని వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన నలుగురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేస్తూ జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం వారికి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ నలుగురినీ కార్యాలయ సహాయకులుగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ కార్యాలయాల్లో నియమించారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

ప్రజాశకి-విజయనగరం టౌన్

జిల్లాలో మొక్కజొన్న పంట రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు గురువారం లేఖ రాశారు. జిల్లా లో మొక్కజొన్న పంట రైతులు అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధర పడిపోయి పెట్టుబడులు రాని పరిస్థితి ఉందన్నారు ఎకరా వద్ద మద్దతు ధర కన్నా 400వందలు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ వెంటనేకొనుగోలు కేంద్రాలు పెట్టీ మద్దతు ధరకు కొనుగోలు చేసే విధానం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రంథాలయానికి కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి గురువారం స్థానిక విజయనగరం ఎస్‌విఎన్ నగర్ వాకర్స్ క్లబ్ ద్వారా శారదా సేవా సంఘం 25 కుర్చీలను వితరణగా అందజేసింది. ఎస్‌విఎన్ నగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు అల్లాడి శివరామకృష్ణ, కార్యదర్శి కందుల సంతోష్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్.లలిత పాల్గొన్నారు. పాఠకుల సౌకర్యార్థం కుర్చీలను అందించిన శ్రీ శారద సేవా సంఘం వారికి కార్యదర్శి లలిత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

29న నాదెండ్ల మనోహర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 29న జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ జిల్లాలో పర్యటించ నున్నారని జనసేన నాయకులు తెలియజేశారు. గురువారం జిఎస్ఆర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు గురాన అయ్యలు, లోకం ప్రసాద్, గిరడ అప్పలస్వామి, ఆదాడ మోహనరావు మాట్లాడారు. 29న చీపురుపల్లి నియోజకవర్గంలో నాదెండ్ల మనోహర్ పర్యటించి వైసిపి నాయకుల దాడిలో గాయపడిన జనసేన కార్యకర్తలను పరామర్శిస్తారని తెలిపారు. అనంతరం విజయనగరం పట్టణంలో జిఎస్ఆర్ హోటల్‌లో ఏర్పాటు చేయనున్న సమావేశంలో శ్రీకాకుళం జిల్లాలోని కొత్తగా నియమితులైన మండల పార్టీ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేస్తారన్నారు. అనంతరం ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ముఖ్య నేతలతో సమావేశమై పార్టీ బలోపేతంపై చర్చిస్తారన్నారు. సమావేశంలో జనసేన నేతలు మిడతాన రవికుమార్, త్యాడ రామకష్ణ (బాలు) పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొల్పే చిత్రాలు రావాలి

'ద్రోహి' చిత్ర పోస్టర్ ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

సమాజాన్ని మేల్కొల్పే చిత్రాలు మరిన్ని రావాలని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. పూర్తిగా విజయనగరానికి చెందిన కళాకారులతో యువ దర్శకుడు అఖిల్ బలరాం దర్శకత్వం వహించిన 'ద్రోహి' చిత్ర పోస్టర్‌ను తన నివాసం వద్ద ఆయన గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. కళలకు నిలయమైన ఈ ప్రాంతంలో ఎంతోమంది వివిధ రంగాల్లో ఖ్యాతి నార్జించారని తెలిపారు. ఈ చిత్రం మంచి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. 30ఏళ్ల క్రితం విజయనగరంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తీసినట్లు దర్శకుడు అఖిల్ తెలిపారు. మణి క్రియేషన్స్ యూట్యూబ్ ఛానల్ లో త్వరలో విడుదల చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో కథానాయిక సుష్మ కృష్ణారావు, సంగీత దర్శకుడు శ్రీకాంత్ శర్మ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ కోలగట్ల

నగరంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల తీరు పట్ల అడిగి తెలుసుకున్నారు. తమకు పథకాలు అందతున్నాయని తెలపడంతో సంతోషం వ్యక్తం చేశారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు సకాలంలో అందే విధంగా చేస్తూ ఆదర్శ పాలనకు జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని అన్నారు. స్థానిక కార్పొరేటర్ జాకిర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే కోలగట్ల ముందున్నారని అన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలు కోలగట్లకు తమ ఆశీర్వాదం అందించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జి రెడ్డి గురుమూర్తి, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి చల్లంనాయుడు

'ఆసరా పంపిణీ చేయొద్దన్నారు'

బొండపల్లి: వైయస్సార్ ఆసరా నిధులు మహిళా సంఘాలకు మంజూరైనప్పటికీ జిల్లా అధికారులు పంపిణీ చేయొద్దన్నారని స్థానిక వెలుగు ఎపిఎం ఎం. సులోచన దేవి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో 28 పంచాయతీల్లో 145 సంఘాలు ఉండగా ఈ సంఘాలకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరయ్యేంతవరకు ఇవ్వొద్దని పీడీ ఆదేశాలు జారీ చేశారని ఆమె తెలిపారు. ఎంపిడిఒ వేదావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపిపి చల్లా చల్లంనాయుడు మాట్లాడుతూ వేంద్రాం సర్పంచి కే శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నకు ఎపిఎం ఇలా సమాధానం ఇచ్చారని త్వరలోనే డబ్బులు మహిళల ఖాతాల్లో పడతాయని చెప్పారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ, హౌసింగ్, ఉపాధి హామీ పథకం, శిశు సంక్షేమ, విద్యా, రెవెన్యూ, ఆరోగ్య శాఖల అధికారులు మాత్రమే పాల్గొనడంతో సమావేశాన్ని తూతూ మంత్రంగా ముగించారు. సమావేశంలో జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, డిటీ డి. శంకర్రావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ రాజేష్

చలివేంద్రం ప్రారంభం

వేపాడ : మండల కేంద్రంలో గల వల్లం పూడి పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఎస్ఐ రాజేష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయనే స్వయంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుళాయి పనులకు శంకుస్థాపన

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని గురువారం జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ టి సీతారాం మాట్లాడుతూ పూసపాటిరేగలో రూ.2కోట్లతో కుళాయి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. రెండు నెలల్లో పనులన్నీ పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, నాయకులు మహంతి జనార్దన్ రావు, మహంతి లక్ష్మణరావు, వార్డు సభ్యులు రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

గర్భిణులు రక్తహీనతతో బాధపడకూడదు..

కొత్తవలస : సమాజంలో ఏ ఒక్క గర్భిణీ రక్తహీనతతో బాధపడకూడదని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి రత్నకుమారి అన్నారు. గురువారం వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని తుమ్మికాపల్లి హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్త్రీలతో ఆమె సమావేశమై గర్భిణులు, మాతా శిశు, సంరక్షణ కార్డులను తనిఖీ చేసి, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రతి గర్భిణీ 2 టి.టి. ఇంజెక్షన్స్ వేసుకొని, ప్రతి నెలా వైద్యాధికారితో తనిఖీలు చేయించుకొని, హెచ్‌బి, బీపీ, షుగర్, ఎత్తు, బరువు ఏ.ఎన్.ఎమ్, అంగన్వాడీ దగ్గర చూపించుకోవాలని తెలిపారు. ప్రధానంగా గర్భిణులు రక్త హీనత రాకుండా రాగి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే డెలివెరీలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.వి. పద్మావతి, ఎంఎల్‌హెచ్ పి కామేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఈశ్వరరావు, ఆశ వర్కర్స్ విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, జగదీశ్వరి, దత్తి లక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

భూ సర్వే స్టోన్ ప్లాంటేషన్ పరిశీలన

రేగిడి: మండలంలోని జోడుబందల గ్రామంలో భూ సర్వేలో భాగంగా స్టోన్ ప్లాంటేషన్‌ను గురువారం తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో భూ సర్వే జరుగుతుందన్నారు. శత శాతం భూ సర్వే నిర్వహించి ఖచ్చితమైన భూ విస్తరణ కల్పించి పట్టాలు అందజేస్తామన్నారు. ఇప్పటికే ఏడు గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తి అయ్యిందని సమర్ధవంతంగా భూ సర్వే చేపడుతున్నామని చెప్పారు. మండలంలోని 39 గ్రామపంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ సర్వేలో రైతులు సహకరించాలని కోరారు. వీరితోపాటు విఆర్ఒ గోపాల్ ఉన్నారు.

ఉద్యోగులు బాధ్యతతో పని చేయాలి

రేగిడి: సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో పనిచేసి, ప్రజలకు జవాబిదారితనంగా ఉండాలని ఎంపిడిఒ గన్నవరం కాశీ విశ్వనాథ రావు అన్నారు. ఈ మేరకు గురువారం అంబాడ గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ముందుగా శాఖల వారీగా పనితీరుపై చర్చించారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, ఇంజనీరింగ్ శాఖల పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. పారిశుధ్య పనులు మెరుగుపరచాలన్నారు. ఈయనతోపాటు పంచాయతీ కార్యదర్శులు గౌరమ్మ, హేమ సుందర్ ఉన్నారు.

అంగన్వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలి

శృంగవరపుకోట: అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కి గ్రాడ్యుటీ ఇవ్వాలనే సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం సిడిపిఒ ఎం ఉమాకి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ ఇస్తోందన్నారు. ఇక్కడ కూడా గ్రాడ్యుటీ చట్టం 1972 ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు లీడర్ డి. శ్యామల, ఏ.భారతి డి. జయలక్ష్మి, ఎం ధనలక్ష్మి, ఏ ఈశ్వరమ్మ, ఎం గౌరి, ఎం కోటలక్ష్మి పాల్గొన్నారు.

'చదువంటే మాకిష్టం'

బొబ్బిలిరూరల్ : విద్యార్థుల్లో పాఠనాభివృద్ధిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వేసవి సెలవు దినాల్లో అమలు చేస్తున్న చదువంటే మాకిష్టం (వియ్ లవ్ రీడింగ్) సమ్మర్ క్యాంపెన్‌ను విజయవంతం చేయాలని నారాయణప్పవలస ప్రధానోపాధ్యాయులు జెసి రాజు అన్నారు. గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 1వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలన్నారు. ముందుగా ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకోవాలని వారితో వాట్స్ అప్ గ్రూప్ క్రియేట్ చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల గ్రంధాలయంలో ఉన్న పుస్తకాలను స్థాయిల వారీగా వేరు చేసి రిజిస్టర్‌లో నమోదు చేసి విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. విద్యార్థులు ఆ పుస్తకాలను చదివేల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రస్టు సేవలు ప్రశంసనీయం

కొత్తవలస: వికలాంగుల సంక్షేమం కోసం శ్రీ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్ బాబు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జగదీష్ అన్నారు. చారిటబుల్ ట్రస్ట్‌లో జరిగిన వికలాంగ గుర్తింపు శిబిరంలో ఆయన గురువారం పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఒక్క సంస్థ కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయలేదన్నారు. గురుదేవా ట్రస్టు ద్వారా కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడంతో పాటు వైద్య సదుపాయం అందించాలని ఆస్పత్రులను కూడా నిర్మించారన్నారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉపకరణాలు ఎంపికకు సుమారు 650 మంది హాజరు అయినట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు. వారికి కొలతలు కూడా తీసుకోవడం జరిగిందని, ఎంపిక చేసిన వారికి మూడునెలల్లో మోటార్ ట్రై సైకిళ్ళు, వీల్ ఛైర్స్, కలిబర్స్, చెవిటి మిస్సన్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలకత్తా నీల్డ్ బృందం సభ్యులు జే గంగాధర్ రావు, సౌమ్య రాయ్, అమర్ మిస్వస్, సందీప్ మిత్రా, ట్రస్ట్ సభ్యులు ఉపకరణాల టెక్నీషియన్ లు, ఆసుపత్రి వైద్యులు తదితదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవవత్సర పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు తమ సత్తాను చాటుకున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కూడా రాణిస్తే మరి కొన్ని చోట్ల ప్రభుత్వ విద్య వెనుకబడింది. కాగా ప్రయివేటు కళాశాలలు ఎప్పటిలాగానే అధిక మార్కులు సాధించి ప్రతిభను చాటుకున్నాయి...

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల హవా చాటుకుంది. ఈ ఏడాది సికెఎం ప్రభుత్వ కళాశాల నుంచి సీనియర్ ఇంటర్‌లో 174మంది పరీక్షలు రాయగా 80 మంది ఉత్తీర్ణులై 46శాతం, ప్రథమ సంవత్సరం పరీక్షలకు 220 మంది హాజరవ్వగా 79మంది ఉత్తీర్ణులై 36శాతం నమోదయ్యిందని ప్రిన్సిపాల్ ఎం. సత్య నారాయణ తెలిపారు. కెజిబివి నుంచి 27మందికి 21మంది ఉత్తీర్ణులై 78శాతం నమోదయ్యింది. అంబేద్కర్ గురుకులం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 25మంది హాజరవ్వగా 8మంది ఉతీర్ణులయ్యారని, ద్వితీయ ఇంటర్‌లో 45మందికి 22మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె. ఉషారాణి తెలిపారు. మహాత్మా జ్యోతీ బాపూలే గురుకులం నుంచి 105మంది పరీక్షకు హాజరవ్వగా 89మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బిబి రావు తెలిపారు.

వేపాడ : మండలంలోని బికెఎస్‌పేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్‌లో రాణించారు. ఈ కళాశాలకు చెందిన ఎల్ వెంకటలక్ష్మి 959 మార్కులు సాధించగా, వై.ఎర్నికుమారి 927, ఐ చైతన్య 897, ఎ. దివ్య 801 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ ఆర్ ఈశ్వరరావు తెలిపారు.

కెజిబివిలో.. కాగా కెజిబివి పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులకు ఇంటర్ పరీక్షలు రాయగా 21 మంది ఉత్తీర్ణ చెందారు. వీరిలో లలిత 925 మార్కులు సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షను 15 మంది రాయగా 9 మంది ఉత్తీర్ణులైయ్యారు. ఇందులో జి. గాయత్రి 500 మార్కులకు 488 మార్కులు సాధించినట్లు ఎస్ఒ కిరణ్మయి తెలిపారు.

అనూష(968)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహనికి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు 72 మంది పరీక్షలు రాయగా 29 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం విద్యార్థులు 75 మంది పరీక్షలు రాయగా 38 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆర్.అనూష 968 మార్కులు సాధిఒంచి టాపర్‌గా నిలిచింది. బి హైమ 961, ఎస్ రమాదేవి 958, ఎస్ స్వాతి 946 మార్కులు సాధించారు.

విజయనగరం: తోటపాలెంలోని కలామ్స్ కళాశాల ఇంటర్ విద్యార్థులు సత్తాను చాటారు. సీనియర్ ఇంటర్‌లో ఎస్. పవిత్ర 976, వై. గణేంద్ర 974, ఎన్.మౌనిక 943 (బైపిసి) మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఉర్లాపు సంహిత 455, జి. శ్రవంతి 455, జె.చైతన్య 454, ఎం. శ్రీవర్షిణి 454, బి. జ్యోష్నప్రియ 453 మార్కులు సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ ఎవిఎస్ నాయుడు, ప్రిన్సిపల్ జి. శంకరరావు తదితరులు అభినందించారు.

సంహిత(455)

స్రవంతి(455)

పవిత్ర(976)

కె.శాంతి(983)

శ్రీనివాస కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థులు కె. శాంతి 983, ఎస్.దీక్షితాంజలి 978(బైపిసి), జూనియర్ ఇంటర్‌లో ఇ. రోహిత్ 457, కె. శరన్ ఫ్లోరా 427(బైపిసి) మార్కులు సాధించారు. గత 28 సంవత్సరాల నుంచి అత్యధిక మంది విద్యార్థులు, అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ పవన్ కుమార్ తెలిపారు.

శ్రీమహలక్ష్మీ జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థులు మామిడి గణేష్ 983, పిసిని సత్యవతి 978(బైపిసి), జమ్ము దినేష్ 976 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో బొద్దల గణేష్ 459, బి. రామకృష్ణ 458, వై.కిషోర్‌నాయుడు 458, కాల్ల మానష 423(బైపిసి) మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటరావు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో గుర్ల ఫస్ట్

గుర్ల: గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మునకాల ఉమ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఎంపిసి గ్రూప్‌లో 959 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. మండలంలో ముద్దాడపేట పంచాయతి మధుర మునకాల పేటకు చెందిన మునకాల ఉమ ప్రథమ స్థానం సాధించడంతో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణ, అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు గ్రామ పెద్దలు ఉమాను అభినందించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

మెరకముడిదాం : ఇంటర్ ఫలితాల్లో గర్భాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో ఎన్. తేజస్విని 956, బైపిసిలో ఎస్. అనూష 909 సాధించారన్నారు. మొదటి సంవత్సర ఫలితాల్లో 48.1 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు.

గజపతినగరం: ఇంటర్ ఫలితాల్లో శ్రీ సాయి సిద్ధార్ధ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరంలో పాండ్రంకి ప్రియాంక 464, ఆవాల చరణ్ 392, ఆవాల వాణి 433, 456 మార్కులు సాదించారు. ద్వితీయ సంవత్సరంలో గోర్లి శిరీష, 972 (బైపిసి), పాండ్రంకి రోహిణి 966, చల్ల జయతేజన్య 967 మార్కులు సాధించారు.

జి.శిరీష(972)

డెంకాడ: మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 104 మంది పరీక్షలు రాయగా 40 మంది పాసయ్యారు. 38.46 శాతం వచ్చింది. ఇందులో ఇద్దరి ఎంపిసి విద్యార్థులకు 458, 413 మార్కులు రాగా బైపిసి విద్యార్థులకు 362, 354 మార్కులు వచ్చాయి. సెకండ్ ఇంటర్‌లో 73 మంది పరీక్ష హాజరు కాగా 43 మంది పాసయ్యారు. 58.9 శాతం వచ్చింది. జి. జోషన 963, బైపిసిలో 932 మార్కులు సాధించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 77 మంది విద్యార్థులకు గాను 9 మంది పాసయ్యారు. 12 శాతం వచ్చింది. సెకండ్ ఇంటర్లో 76 మంది రాయిగా 20 మంది ఉత్తీర్ణత సాధించారు.

జి.జోషణ(963)

వాగ్దేవి విజయ దుంధుబి

కొత్తవలస: ద్వితీయ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక వాగ్దేవి కళాశాల విద్యార్థులు విజయ దుందబి మోగించారు. పోలమలశెట్టి స్రవంతి 976, డి. రమ్య942, ఎన్ హరిప్రియ 929, వి వనిజ929 మార్కులు సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ కోటిని మహేశ్వరరావు అభినందించారు. 88 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 72 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కళాశాలలో 15 మంది విద్యార్థులు 920 మార్కులు సాధించారని తెలిపారు. కళాశాలకు 82శాతం ఉత్తీర్ణత లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి సంవత్సరంలో 101 మంది విద్యార్థులు పరీక్షలె రాయగా 69 మంది పాసయ్యారన్నారు.

పి. స్రవంతి(976)

సాయి జూనియర్ కళాశాలలో ఒక్కరూ పాసవ్వలేదు..

కొత్తవలస మండలంలోని ఇంటర్ మొదటి సంవత్సరంలో 263 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 46 మంది పాస్ అయ్యారని, ద్వితీయ సంవత్సరం 280 మంది రాయగా, 58 మంది పాసయ్యారని మండల విద్యాశాఖాధికారి జె. త్రినాథరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 50 మంది రాయిగా ఒక్కరు కూడా పాస్ కాలేదని, ద్వితీయ సంవత్సరం 57 మంది రాయిగా 8 మంది పాసయ్యారని అన్నారు. పెరుమాళి ఆదర్శ పాఠశాల మొదటి సంవత్సరం 107 మంది రాయగా, 28 మంది పాస్ అయ్యారని, రెండవ సంవత్సరం 90 మంది రాయగా, 32 మంది పాస్ అయ్యారని, శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ 133 మంది రాయాగా, 14 మంది పాస్ అయ్యారని, సెకండియర్ 157 మంది రాయగా 23 మంది పాస్ అయ్యారని, కుమ్మరి పేట లోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మొదటి సంవత్సరం 23 మంది రాయగా 4 పాసయ్యారని, రెండవ సంవత్సరం 33 మంది రాయగా ముగ్గురు పాసయ్యారని,

పార్టీ పెద్దల ఆదేశంతోనే పర్యటిస్తున్నా..

- మాజీ ఎమ్మెల్యేతో కలిసి పనిచేసేందుకు సిద్ధం
- ఫోన్ చేస్తే వారు స్పందించలేదు
- టిడిపి నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి అధ్యక్షుడు, పెద్దలు ఆదేశిస్తేనే నియోజకవర్గంలో పర్యటిస్తున్నానని నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ అన్నారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీలో తను 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం చేయనీయకుండా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అనుచర టిడిపి నాయకులు తనతో చిరు వివాదానికి దిగటంపై గురువారం ఆయన ఒక వీడియో విడుదల చేస్తూ స్పందించారు. ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారితో కలిసి గ్రామాల్లో చేపడితే చక్కటి స్పందన వస్తుందని పార్టీ పెద్దలు ఆదేశించారన్నారు. పెద్దల ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, ఆమె భర్త కోళ్ల రాంప్రసాద్‌కి ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు. ఈ విషయమై కాల్ రికార్డులను బయట పెట్టమన్నా చూపిస్తానని తెలిపారు. ఇదే విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు నియోజకవర్గ పరిధి ఐదు మండలాల్లోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టిడిపిని గెలిపించాలని ప్రచారం చేస్తున్నానన్నారు. తను వచ్చిందే నియోజకవర్గంలో టిడిపిని మరింత బలోపేతం చేసేందుకని చెప్పారు. తాను చేస్తున్న గ్రామ పర్యటనల వీడియోలను కూడా అధిష్టానానికి పంపిస్తున్నామని, తను వచ్చాక నియోజకవర్గంలో టిడిపి బలపడిందని, పార్టీ యువతలో, మహిళల్లో ఉత్సాహం నింపామని చెప్పారు. ఇందుకు సంబంధించి గత ఆరు నెలలకు ముందు పార్టీ పరిస్థితి, తాను వచ్చాక పార్టీకి పెరిగిన మైలేజ్ పై తగిన ఆధారాలు కూడా ఇస్తామని తెలిపారు. క్యాడర్‌కు గౌరవం లేని చోట ప్రస్తుతం చిన్నస్థాయి క్యాడరుకి ఫోన్ చేసి సమాచారం పంపుతున్నారంటే అందులో ఖచ్చితంగా తమ పాత్ర ఉందన్నారు. ఇక పట్టణంలోని శ్రీనివాస కాలనీలో బుధవారం రాత్రి జరిగిన వాగ్వాద విషయమై రకరకాల రెచ్చగొట్టే మేసేజ్‌లు పెడుతూ రాద్ధాంతం చేయటాన్ని తప్పుబట్టారు. టిడిపి పెద్దలు ఆదేశిస్తే ఇక్కడ కార్యక్రమాలు పెద్దఎత్తున చేస్తున్నానని ఇలాంటి సమయంలో కొంతమంది పార్టీ నేతలు, శ్రేణులు తమతో తగాదాలకు దిగటం, వ్యతిరేక స్టేట్మెంట్లు వంటివి ఇస్తూ బెదిరింపు చర్యలకు దిగినంత మాత్రాన భయపడేది లేదని చెప్పారు. ఎవరూ వద్దు మేము మాత్రమే ఉంటామన్న రోజులు పోయాయని, అందరినీ కలుపుకొని వెళ్తేనే మంచిదని సూచించారు. పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకుని మరింత ఉధృతంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఏమైనా ఉంటే తనపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసుకోవచ్చని వీడియో ద్వారా వివరించారు. ఇక తనకు మద్దతుగా ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు చేయవలసినంత మంచి చేస్తామన్నారు. టికెట్ విషయం అధిష్టానం చూసుకుంటుందని, పార్టీ ఎవరికి టికెట్ ఇస్తే వారి గెలుపునకు అవిశ్రాంతంగా పనిచేస్తామని, అధిష్టానం ఏ బాధ్యతలు అప్పగించినా బాధ్యతతో నిర్వర్తిస్తామని తెలిపారు.

గొంప కృష్ణ

'శిక్ష'ణతో కుంటిపడిన పాలన

- కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఆరు నెలల పాటు శిక్షణ
- ఉన్న వారితో నెట్టికొస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- డెంకాడ

సచివాలయ ఉద్యోగుల శిక్షణ కాలం ప్రజలకు శిక్షగా మారింది. సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లుకు ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం పూనుకుంది. దీంతో మండలంలో ఉన్న కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లంతా శిక్షణ కోసం వెళ్లిపోయారు. దీంతో సచివాలయాలు బోసుపోతున్నాయి. ఉన్న ఒక్కరిద్దరితో సచివాలయాల నిర్వహణ అధ్వన్నంగా తయారైంది.

ప్రభుత్వం త్వరలో గ్రామ సచివాలయాల్లోని రిజిస్ట్రేషన్లు ప్రారంభించనున్న నేపథ్యంలో సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఆరు నెలలపాటు ట్రైనింగ్ ఇస్తుంది. సచివాలయాల్లో పనిచేస్తున్న ముఖ్యమైన ఇద్దరినీ ట్రైనింగ్‌కు పంపడంతో సచివాలయనికి వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

మండలంలోని 26 పంచాయతీలకు గాను 17 సచివాలయాలు ఉన్నాయి. ఆ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ కార్యదర్శిలతో పాటు వాటి పరిధిలో ఉన్న కార్యదర్శులను అలాగే డిజిటల్ అసిస్టెంట్లు నెల రోజుల క్రితం ట్రైనింగ్ నిమిత్తం వెళ్లిపోయారు. వీరి స్థానంలో వెల్ఫేర్ అసిస్టెంట్లకు డిజిటల్ అసిస్టెంట్ పనులు అప్పగించారు. 26 మంది కార్యదర్శులకు గాను 23 మందిని ట్రైనింగ్‌కు పంపించి మిగిలిన ఆకులపేట కొండ్రాజుపేట, చింతలవలస-2 కార్యదర్శులను ఇంఛార్జిలుగా నియమించారు. దీంతో సచివాలయాల్లో ఈ సర్వీసు పనులు అవ్వక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈ సర్వీసులు చేయకపోవడంతో అవస్థలు పడి సచివాలయానికి వచ్చిన ప్రజల వెను దిరుగుతున్నారు. మండలంలో కార్యదర్శులను డిజిటల్ అసిస్టెంట్లను ఒకేసారి ట్రైనింగ్‌కు పంపడంపై ప్రజలు మండిపడుతున్నారు. కొన్ని మండలాల్లో సగం మందిని ట్రైనింగుకు పంపించి మిగిలిన వారిచేత సచివాలయ పనులు చేయిస్తున్నారు. కానీ ఈ మండలంలో ఒకేసారి అందరినీ ట్రైనింగ్ పంపడం ఎంతవరకు సమంజసం అని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలపాటు గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయాల్లో లేకపోతే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు..

ఉపాధికి రూ.2లక్షల కోట్లు కేటాయించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - కొత్తవలస

దేశంలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు రూ. 2 లక్షల కోట్ల కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మండలంలోని కర్రీ చిన్నయ్యపాలెం, దాసరవానిపాలెం, గాంధీనగర్ గ్రామాల్లో గురువారం ఆయన పర్యిటించి ఉపాధి కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకి రూ.600 కూలి రావాలని, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా చర్యలు చేపట్టిందని ఆరోపించారు. రాష్ట్రాలకు నిధులు కేటాయించకుండా మోడీ సర్కార్ తాత్సారం చేస్తుందన్నారు. ఉపాది చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. వామపక్ష పార్టీలు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు తీసుకొచ్చి రెండు పూటలా పని పద్ధతిని తీసుకొచ్చారని, దీనివల్ల ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ లాంటి రాష్ట్రాల్లో ఉపాది కూలీలకు 200 రోజులు పనికల్పించి రూ.330 కూలి చెల్లిస్తుంటే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఉపాధి పనులను కూలీలకు దూరం చేసే విధంగా విధానాలను అవలంబిస్తున్నారని తెలిపారు. ఎండలు తీవ్రతను తట్టుకోలేక కూలీలు వడదెబ్బకు లోనై మృత్యువాత పడుతున్నా ప్రభుత్వ అధికారులు ఒక్క పూట పని జరిగేలా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

మళ్లీ శంకుస్థాపన సిగ్గుసిగ్గు

భోగాపురం : గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారని, మరలా అదే విమానాశ్రయానికి ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ రెడ్డి శంకుస్థాపన చేయడం సిగ్గుసిగ్గు అని నెల్లిమర్ల టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగారు రాజు అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో ఉన్న మండల పార్టీ అధ్యక్షులకు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్‌లకు, గ్రామ పార్టీ అధ్యక్షులకు, బూత్ ఇంచార్జ్ లకు ఆర్టీఎస్, టెలిగ్రామ్, బాట్, మన టిడిపి యాప్, ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విమానాశ్రయానికి సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇస్తామని, విమానాశ్రయంతో అభివృద్ధి జరగదని అన్నారన్నారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చి విమానాశ్రయం వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి జరుగుతుందని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపి ఈ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిస్తాదని జోష్యం పలికారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎంత అభివృద్ధి చేశారో చర్చికి సిద్ధమా అని ప్రస్తుత ఎమ్మెల్యేకి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పూసపాటిరేగ నాయకులు అకీరి ప్రసాద్ రావు, డెంకాడ మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, ఇంటిగ్రేటెడ్ ట్రైనర్ విమలా రాణి, క్లస్టర్ ఇంఛార్జిలు దంగా భూలోక, సామంతుల సొంబాబు, పిడుగు తోటరావు, దాసరి అప్పలస్వామి, మైలపల్లి సింహాచలం, ఇజ్జిరోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ఇళ్ల పట్టాలు పంపిణీ

భోగాపురం : ఎయిర్ పోర్ట్ నిర్వాసిత గ్రామాలలో రెండో విడతగా 28 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం పంపిణీ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మరడ పాలెం- 11, మూడసర్ల పేట-2, బైరెడ్డి పాలెం-4, రెల్లిపేట -7, బొల్లింకల పాలెం-4, చొప్పున ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. గతంలో 376 మంది నిర్వాసితులకు ఇవ్వటం జరిగిందని, మిగిలిన అర్హులైన నిర్వాసితులను గుర్తించి ఇప్పుడు మరల ఇచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస రావు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, సర్పంచులు మట్ట అయ్యప్ప రామకృష్ణా రెడ్డి, బైరెడ్డి రమణ, అప్పన్న, పాల్గొన్నారు.

సిఎం సభకు తరలి రావాలి

భోగాపురం : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సిఎం జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో సవరవిల్లి వద్ద ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు తరలి రావాలని వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ కోరారు. గురువారం మండలంలోని నందిగామ, ముంజేరు, రామచంద్రపేట, ముక్కాం, బైరెడ్డిపాలెం సచివాలయాలు, దల్లిపేట పంచాయతీ కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. సభకు జనసమీకరణ చేయాలన్నారు. ఈ సమావేంలో ఎంపిడిఒ దాసరి బంగారయ్య, ఎపిఒ ఆది బాబు, ఎపిఎం వై.రమణ, జెసిఎస్ కన్వీనర్ బైరెడ్డి యర్రప్పలనారాయణ రెడ్డి, వైస్ ఎంపిపి రావాడబాబు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ నరిసింహులు, సర్పంచులు గరే మురళీమోహన్ రావు, పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

బొబ్బిలి : ఈ నెల 29న ఎస్ఇబి కార్యాలయంలో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు వేలం వేయనున్నట్లు సిఐ ఆర్.జైభీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఇబి అసిస్టెంట్ సూపరింటెండెంట్ శైలజరాణి సమక్షంలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటకు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వివిధ గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన గ్లాసులను ఎంఇఒ వై దుర్గారావు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ముందుగా వంగర, కొత్తవలస గ్రామాలలో గల ప్రాథమిక పాఠశాలలకు పంపిణీ చేశామని తెలిపారు. మండలానికి 2,967 గ్లాసులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సి కార్యాలయ సిబ్బంది దేవకివాడ తవిటి నాయుడు, ప్రధానోపాధ్యాయులు శారద, జనార్ధన రావు పాల్గొన్నారు.

రామభద్రపురం: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సకల సౌకర్యాలు అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం విద్యార్థులు రాగి జావ తాగేందుకు పంపిణీ చేసిన స్టీల్ గ్లాసులను ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా మౌళిక సదుపాయాల కల్పన చేశామని గుర్తు చేశారు. రాగిజావ పంపిణీ నిమిత్తం మండలంలో 58 పాఠశాలలకు 4,524మంది పిల్లలకు స్టీల్ గ్లాసులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మండల విద్యాశాఖాధికారి తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ రమామణి, స్థానిక పిఎసిస్ ఛైర్మన్ కిర్ల చంద్రశేఖర్, మండల జేసియస్ ఛైర్మన్ చింతల సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు సింగుబాబు మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మాజీ జెడ్‌పిటిసి దంతలూరి శంకర సీతా రామరాజు (73) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం కొండ వెలగాడ లో తుది శ్వాస విడిచారు. ఆయన గ్రామ సర్పంచ్‌గా 4 సార్లు, ఎంపిటిసిగా సేవలందించి 2006లో జెడ్‌పిటిసిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, నాయకులు చిక్కాల సాంబశివరావు, నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, చీపురపల్లి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున, డెంకాడ, పూస పాటి రేగ మాజీ ఎంపిపిలు కంది చంద్ర శేఖర్ రావు, మహంతి చిన్నం నాయుడు, సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు తదితరులు సంతాపం తెలిపారు.

సింగుబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు